క్లుప్తంగా

డేటా ఎంట్రీ షురూ

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంది. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో సోమవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీ ప్రారంభమైంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కులగణన సర్వే వివరాలను తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి పర్యవేక్షణలో కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్ చేస్తున్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు రెవెన్యూ, మండల పరిషత్ ఆపరేటర్లతోపాటు గ్రామ పంచాయతీ సెక్రటరీలను వినియోగిస్తున్నారు.

మంత్రి తుమ్మల పరామర్శ

ఇల్లెందు: పట్టణానికి చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి, కాంగ్రెస్ నేత కనగాల పేరయ్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. సోమవారం ఇల్లెందులోని ఆయన స్వగృహానికి వెళ్లిన మంత్రి యోగక్షేమాలను ఆరాతీశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ డీవీ, గౌరిశెట్టి సత్యనారాయణ, ప్రభునాథ్, సమ్మయ్య, గుత్తా వెంకటేశ్వరరావు ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

టేకులపల్లి: సేవాలాల్ సేన ఆధ్వర్యంలో డిసెంబర్ 8న టేకులపల్లి నుంచి ప్రారంభం కానున్న ప్రజా రగ్ జోశ్ యాత్ర కరపత్రాలను బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, బేతంపూడి పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు సోమవారం ఆవిష్కరించారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేశ్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజన చట్టాలను కాలరాస్తూ పాలకులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్నారు. బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, బానోతు కిషన్, బాణోతు రామ, అప్పారావు, బాలకృష్ణ, కిషన్, సత్యనారాయణ, చందర్, రవి, శ్యామ్, లచ్చు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు..

పాల్వంచరూరల్: వచ్చే నెల 1వ తేదీన హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరపతలపెట్టిన మాలల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని దంతలబోరు ఎస్సీకాలనీలో సోమవారం బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సంతోష్ ట్రోఫీకి ఎంపిక

ఇల్లెందురూరల్: జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సంతోష్‌కుమార్ ఎంపికయ్యారు. కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతూ ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న సంతోష్ ఇటీవల నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ఆయన ప్రతిభను గుర్తించి జాతీయ ఫుట్‌బాల్ అకాడమీ సంతోష్‌ట్రోఫీకి ఎంపిక చేసింది. సోమవారం ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అధ్యాపకులు సంతోష్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల గేమ్స్, స్పోర్ట్స్ కన్వీనర్ జి.శేఖర్, ఎకనామిక్స్ ప్రొఫెసర్ బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి అభినందన

ఇల్లెందు: ఇల్లెందులోని సింగరేణి వైద్యశాల సిబ్బందిని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ అభినందించారు. సోమవారం ఏరియా వైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మాట్లాడారు. 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండాలని, రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. తొలుత సీహెచ్‌పీ సిబ్బంది జీఎం జాన్‌ఆనంద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ క్రిష్టఫర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

కొత్తగూడెంఅర్బన్: బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీల్లో కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు సోమవారం పాఠశాలలో వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి సర్టిఫికెట్లు అందజేసి, మాట్లాడారు. చిత్రలేఖనం మానవ అభివృద్ధిలో కీలకమైన కళ అని పేర్కొన్నారు. సీడీపీఓ విజయ్‌కుమారి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రవీందర్, సుభద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానందుడు చూపిన మార్గంలో నడవాలి

కొత్తగూడెంఅర్బన్: యువత వివేకనందుడి మార్గదర్శకాలను పాటించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మేకల ప్రకాష్ తెలిపారు. సోమవారం పాతకొత్తగూడెం 4వ వార్డులో వివేకానంద విగ్రహ ప్రతిష్ఠ కోసం భూమి పూజ నిర్వహించారు. అన్నే శ్రీనివాసరావు, జయసింహ, ఆర్టిస్టు రాము, మహేశ్, డాక్టర్ ప్రభాకర్‌రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

పాలాభిషేకం

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం వైరా నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం పాపకొల్లులో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

మాయదారి కష్టాలొచ్చాయి..

- ప్రాణాలు పోతే కానీ పట్టించుకోరా..
- ఎమ్మెల్యే ఆదేశాలూ బేఖాతరు
- కేటీసీకి వచ్చివెళ్లే వాహనాలతో దాసుతండా వాసుల అవస్థలు



దాసుతండా రోడ్డుపై లారీ వెళ్తుండగా ఎగిసిపడుతున్న దుమ్ము

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం ఓపెన్‌కాస్టుకు వెళ్లే వాహనాలతో ఎగిసిపడుతున్న దుమ్ముతో అనారోగ్యం పాలై ఆస్పత్రుల్లో చేరుతున్నామంటూ దాసుతండా గ్రామస్తులు మూడు నెలలుగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. టేకులపల్లి సెంటర్ నుంచి దాసుతండా వరకు రహదారి విస్తరించి, డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో 2023 ఆగస్టులో అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ సీఎస్‌ఆర్ నిధులు రూ.2 కోట్లతో పనులను ప్రారంభించారు. కిలోమీటర్ వరకు రోడ్డు వెడల్పు, సెంట్రల్‌లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగిలిన కిలోమీటర్ వరకు రోడ్డు వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు కూడా ప్రారంభించారు.

ప్రభుత్వం మారడంతో..

టేకులపల్లి సెంటర్ – దాసుతండా మధ్యలో మిగిలిన కి.మీ. రహదారి విస్తరణ, అభివృద్ధి కోసం ఇరువైపులా తవ్వి మిక్సింగ్ వేశారు. కానీ ప్రభుత్వం మారడంతో పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. దీంతో ప్రతిరోజూ దుమ్ము, ధూళితో రేగులతండా, దాసుతండా వాసులకు ఇబ్బందులు మొదలయ్యాయి. కేటీసీ నుంచి వచ్చే, పోయే వాహనాలతో ఎగిసిపడే దుమ్ముతో నానాయాతన పడుతున్న స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సుమారు మూడు నెలల కిందట ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య రోడ్డుని పరిశీలించి పనులు తక్షణమే ప్రారంభించాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను, రోడ్డుపై నీరు చల్లాలని సింగరేణి అధికారులను ఆదేశించినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విసుగు చెందిన గ్రామస్తులు పలుమార్లు రోడ్డుపై వాహనాలు నిలిపి నిరసన తెలిపారు. దీంతో మొక్కుబడిగా రోడ్డుపై నీటిని పిచికారీ చేశారు. నీళ్లు చల్లడం కాదు రోడ్డు నిర్మాణం కావాలని స్థానికులు ఈ నెల 16, 17వ తేదీల్లో మళ్లీ రాస్తారోకో చేశారు. దీంతో ఎమ్మెల్యే కనకయ్య ఈ నెల 19న రోడ్డును పరిశీలించి పీఆర్ అధికారులతో మాట్లాడి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాటలకు తలఊపిన అధికారులు ఆ రోజు మొక్కుబడిగా జేసీబీ పెట్టి రోడ్డుకిరువైపులా తవ్వించారు. మరుసటి రోజు నుంచి షరా మామూలే. ఎమ్మెల్యే ఆదేశించినప్పటికీ పీఆర్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో దాసుతండాలోని దుమ్ము, ధూళి బాధితులు ఆదివారం మళ్లీ బొగ్గు లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. రోడ్డు నిర్మాణం అయ్యేంత వరకు మూడు పూటలు నీటిని చల్లించాలని, పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



వాహనాలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న ప్రజలు

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

దాసుతండాలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులు కాంట్రాక్టర్ జాప్యం వల్లనే జరగడం లేదు. ఈ విషయంలో కాంట్రాక్టర్‌కు పలుమార్లు నోటీసులు కూడా ఇచ్చాం. పనులను తక్షణమే ప్రారంభించకుంటే కాంట్రాక్టు రద్దు చేస్తామని సూచించాం.

–నవీన్, పంచాయతీ రాజ్ ఏఈ

ఎన్ని సార్లు చెప్పినా అంతే..



రోడ్డు పక్కనే మా ఇల్లు, దుకాణం ఉంది. రోడ్డు వెడల్పు చేస్తామని తవ్వి వదిలేయడంతో లారీలు వచ్చివెళ్తున్నప్పుడల్లా దుమ్ము, ధూళి ఎగిసిపడుతున్నాయి. ఇల్లు, దుకాణంలోని సామగ్రిపై దుమ్ము పేరుకుపోతోంది. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు.

–లకావత్ కల్యాణి, దాసుతండా

ఇంకెందరి ప్రాణాలు పోవాలి?



రోడ్డు వెడల్పు కోసం పాత రోడ్డును తవ్వి వదిలేయడంతో ఇబ్బంది పడుతున్నాం. దుమ్ము, ధూళితో ఇప్పటికే అనారోగ్యం పాలై పలువురు మృతి చెందారు. ఇంకా ఎందరి ప్రాణాలు పోవాలి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలి.

–బానోతు చందు, దాసుతండా

వరి అవశేషాలు కలియదున్నితే ఉపయోగం

టేకులపల్లి: వరి కొయ్యల అవశేషాలను కలియదున్నడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని ఏఓ నీరుడు అన్నపూర్ణ సోమవారం తెలిపారు. వరి పంట కోత తరువాత మిగిలిన వరి కొయ్యల అవశేషాలపై సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 10–15 కిలోల యూరియా చల్లాలని పేర్కొన్నారు. నీటి తడి ద్వారా డీకంపోజింగ్ వేగవంతం చేయాలని, వరి అవశేషాలను రోటావేటర్ ద్వారా మట్టిలో కలియదున్నడం వల్ల పోషకాలు విడుదల అవుతాయని, వరి కొయ్యలు డీకంపోజ్ అవడానికి 20–30 రోజులు పడుతుందని తెలిపారు. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌తో పోషకాలు వస్తాయని, పాస్ఫరస్, సల్ఫర్ పంటలకు ఉపయోగపడతాయని, మట్టి నాణ్యత పెరుగుతుందని, మట్టిలో జీవసత్వం పెరిగి ఉత్పాదకత మెరుగవుతుందని, రసాయన ఎరువుల అవసరం తగ్గడంతో ఖర్చు కూడా తగ్గుతుందని వరి కొయ్యల అవశేషాల దహనాన్ని తగ్గించడం వల్ల వాయు కాలుష్యం తగ్గుతుందని వివరించారు.

పనులను వెంటనే ప్రారంభించాలి..

టేకులపల్లి: టేకులపల్లి నుంచి కోయగూడెం ఓపెన్ కాస్టుకు వెళ్లే రహదారి గుంతలమయమై ప్రమాదకరంగా ఉందని, మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ సింగరేణి అధికారులను సోమవారం కోరారు. వాహనాల రాకపోకలతో దుమ్ము, దూళితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

'ఆటోవర్కర్స్' సహాయ కార్యదర్శిగా శివకృష్ణ

జూలూరుపాడు: ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా సహాయ కార్యదర్శిగా కొత్తూరు గ్రామ పంచాయతీ పెద్దహరిజనవాడకు చెందిన గార్లపాటి శివకృష్ణ ఎన్నికయ్యారు. సోమవారం శివకృష్ణ జూలూరుపాడులో మాట్లాడారు. ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు..



జూలూరుపాడు: వ్రతం నిర్వహిస్తున్న దంపతులు



పాల్వంచ: లింగార్చన నిర్వహిస్తున్న వేద పండితులు

జూలూరుపాడు: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పాపకొల్లు ఉమాసోమలింగేశ్వర ఆలయం, కాకర్ల సంతాన వేణుగోపాలస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పాపకొల్లు శివాలయంలో అర్చకులు మధుకుమార్ శర్మ మహా శివలింగానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. కాకర్ల శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో పూజారులు ఆరుట్ల ఫణి రాజాచార్యులు, లక్ష్మణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. నాగేంద్ర స్వామి ఆలయంలోని నాగులపుట్టకు మహిళలు, దంపతులు, చిన్నారులు పాలు పోశారు. వెంగన్నపాలెం శ్రీదత్తనగర్‌లోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో సాయి సత్య వ్రతాన్ని మహిళలు నిర్వహించారు. పూజారి శ్రీరామచంద్ర మూర్తి వ్రతాన్ని చేయించారు.

పాల్వంచరూరల్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం, శ్రీలలిత కామేశ్వరి, శివాలయాల్లో భక్తులు దీపారాధనలు చేశారు.

వైభవంగా లింగార్చన

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచలోని ప్రముఖ ప్రాచీన ఆత్మలింగేశ్వరాలయంలో కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా లక్ష పార్థివ లింగార్చనను వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ రామచంద్ర సాయి స్వామిజీ ఆత్మలింగేశ్వరాలయానికి లక్ష పార్థివ లింగాలను సమర్పించారు. దీంతో ఆలయ అర్చకులు సర్వదేవభట్ల జితేంద్ర శర్మ, ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసి, లక్ష లింగాలను ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష పార్థివ లింగార్చన, సహస్ర లింగార్చన, జ్యోతిర్లింగార్చన, నవరత్న లింగార్చనను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ రమణ, నాగర్జున, ఎల్లావుల వెంకటేశ్వరరావు, వీరయ్య పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

సుజాతనగర్: ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని కేయూ ఫార్మసీ డీన్ గాదె సమ్మయ్య అన్నారు. స్థానిక శ్రీ ఫార్మసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీఫార్మసీ, ఫామ్‌డీ కోర్సుల అనంతరం గల అవకాశాలను వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాల్సిన ఫార్మసీ విద్యార్థులు వారి అమూల్యమైన సర్టిఫికెట్‌ను అద్దెకు ఇచ్చి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ కిరాయికి ఇవ్వడం డ్రగ్స్, కాస్మొటిక్ యాక్ట్ ఉల్లంఘన అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బొంత విజయకుమార్, డాక్టర్ గుంచేటి చిరంజీవి, డి.హరీశ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాదె సమ్మయ్య

ధర్నాను జయప్రదం చేయండి..



మాట్లాడుతున్న ముద్దా భిక్షం

సింగరేణి(కొత్తగూడెం): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గతంలో రైతాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాలను కార్మికుల హక్కులను హరించే విధంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో యాకూబ్‌షావలి, ఆర్.మధుసూదన్‌రెడ్డి, బానోత్ ధర్మా, పెద్దబోయిన సతీశ్, వై.గోపాల్‌రావు, ఎం.రాజశేఖర్, ఎం.చంద్రశేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలపై సర్వే

ఇల్లెందు: ప్రైవేట్ వైద్యశాలల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. సోమవారం ఇల్లెందులోని పలు ప్రైవేట్ వైద్యశాలలను సందర్శించిన పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.అజయ్, పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చంద్ర అరుణ, జిల్లా అధ్యక్షురాలు సావిత్రి మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేయాలని కోరారు. మందులు సరిపడా ఉండటం లేదని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్పొరేట్ వైద్యశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, అవసరం లేకున్నా టెస్టులు, ఆపరేషన్ చేసే విధానానికి స్వస్తి పలకాలని కోరారు. వైద్యులు పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు కోరం ముత్తక్క, ధారావత్ ముత్తక్క పాల్గొన్నారు.

గాయత్రీ కోఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

పాల్వంచ: పట్టణంలో కేఎస్‌పీరోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గాయత్రీ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌ను సోమవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వనమాల శ్రీనివాస్, రీజినల్ మేనేజర్ చిట్లబొట్ల వంశీకృష్ణ, బ్యాంక్ పాలక వర్గ సభ్యులు ముత్యాల లక్ష్మణ్‌రెడ్డి, ఎం.సౌజన్య, ఎ.రాజిరెడ్డి, ఎ.సత్యం, వై.అశోక్, కె.శ్రీనాథ్, విజయ్, గంగాధర్, మాధవి, సతీశ్, రవికుమార్, సాబీర్‌పాషా, రంగారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణికి పరామర్శ

ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మిని పట్టణంలోని కాంగ్రెస్ నేతలు పలువురు పరామర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని అపోలో వైద్యశాలలో ఆమెకు శస్త్రచికిత్స జరిగింది. ఇల్లెందుకు చెందిన కాంగ్రెస్ నేతలు చిల్లా శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ బాదావత్ సరోజ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వెన్నెలకు శుభాకాంక్షలు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సాంస్కృతిక చైర్‌పర్సన్‌గా ప్రజాయుద్ధ నౌక గద్దర్ కుమార్తె గుమ్మడి వెన్నెల సోమవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆమెను కొత్తగూడెం గాంధీ పథం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు చింతలచెర్వు గెర్షోము, సభ్యులతో హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వెన్నెలను కలిసిన వారిలో గాంధీపథం సభ్యులు జ్ఞానవినోదిని, రాజేశం, ఎల్లయ్య, కుసుమ, వాణి ఉన్నారు.

నేడు శంకుస్థాపన

జూలూరుపాడు: మండలంలోని గంగారంతండా, గాంధీనగర్ గ్రామాల్లో మంగళవారం సీసీ రోడ్ల పనులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లో పశువుల షెడ్‌ను ప్రారంభిస్తారని, పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తలకొరివి పెడుతున్న కుమార్తె సత్యవతి

టేకులపల్లి: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రామాలయం ఏరియాకు చెందిన యాసం వెంకన్న (70) సోమవారం మృతి చెందగా ఆయనకు కుమారులు లేరు. భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు సత్యవతి, ఉపేంద్ర ఉన్నారు. దీంతో పెద్ద కుమార్తె తండ్రికి తలకొరివి పెట్టి దహనసంస్కారాలు నిర్వహించింది.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



జూలూరుపాడు: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భిక్షం

జూలూరుపాడు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం కాకర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సహకార సంఘం అధ్యక్షుడు చీమలపాటి భిక్షం ప్రారంభించగా.. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్, సొసైటీ డైరెక్టర్ చాపలమడుగు రామ్మూర్తి, ఏఈఓ సరిత, సొసైటీ కార్యదర్శి రమణారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించడం ద్వారా మద్దతు ధర పొందొచ్చని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని సంగం గ్రామంలో పాల్వంచ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే రెడ్డిగూడెం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని రైతులతో ప్రారంభించారు. కొత్వాల శ్రీనివాసరావు, డీసీఓ ఖుర్షీద్, తహసీల్దార్ వివేక్, కాంపెల్లి కనకేశ్, ఎంపీఓ నారాయణ, ఏఓ శంకర్, పీఆర్ డీఈ రామకృష్ణ, బుడగం రామోహన్‌రావు, చావుగాని పాపారావు, నారాయణ, వెంకటేశ్వరరావు, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శప్రాయుడు

పాల్వంచ: దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సాయంత్రం నెహ్రూనగర్‌లో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ బృందం కళాకారులచే ×సంఘం శరణం గచ్ఛామి×అనే నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శనను కూనంనేని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేడ్కర్ అగ్ర వర్ణ వివక్షను ఎదిరించి గొప్ప మేధావిగా ఎదిగి, లండన్‌లోని పేరుగాంచిన యూనివర్సిటీలో చదివారన్నారు. న్యాయశాఖ మంత్రిగా, రాజ్యాంగ రచన సంఘానికి అధ్యక్షుడిగా, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంలో కీలక పాత్ర వహించారన్నారు. కాల్వ దేవదాస్, కొత్వాల శ్రీనివాసరావు, కాల్వ భాస్కర్‌రావు, కాల్వ ప్రకాష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సుజాతనగర్: కోయగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కోయగూడెం, ఉప్పరిగూడెం గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.11.50 లక్షలతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, ఎంపీడీఓ బి.భారతి, డిప్యూటీ తహసీల్దార్ కె.నాగరాజు, ఏపీఓ చందర్, ఏఓ జి.నర్మద, ఏఈఓ ప్రనూష, కాంగ్రెస్ నాయకులు చింతలపూడి రాజశేఖర్, చిమట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులు

ఇల్లెందు: సుదిమళ్ల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 24న హైదరాబాద్ జింఖాన మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సుదిమళ్ల గురుకులం నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. అండర్–19 విభాగంలో బి.బిందుప్రియ 71 కేజీల విభాగంలో బంగారు పతకం, పి.సుభద్ర 55 కిలోల విభాగంలో బంగారు పతకం, వై.అంజలి 49 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించారు. ఇక అండర్–17లో వి.మానస 59 కిలోల విభాగంలో వెండి పతకం, జె.సాయికీర్తన 40 కిలోల విభాగంలో వెండి పతకం, ఎస్.హాసిని 64 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జున్‌రావు, కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ పి.రత్నకుమారి, కే.మాధవి, కోచ్ లోహిత, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని, పట్టణంలో రద్దు చేసిన సర్వే నంబర్లను తిరిగి పునరుద్ధరించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ నాయకుడు అసెంబ్లీ ఎన్నికల ముందు వాగ్దానాలు ఇచ్చి గెలిచాక అమలు చేయకపోవడం పరిపాటిగా మారిందన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సాయి, కటికాల రంజిత్, వంగా రవిశంకర్, ఈసం మురళీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్రా కామేశ్